క్లుప్తంగా

డీఎల్పీఓగా రమణయ్య బాధ్యతల స్వీకారం

నరసరావుపేట రూరల్: డివిజనల్ పంచాయతీ అధికారిగా డాక్టర్ పి.రమణయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న రమణయ్య పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

జగనన్న కాలనీల్లో నిర్మాణాలు వేగవంతం చేయాలి

యడ్లపాడు: జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన లబ్ధిదారులంతా త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి చెప్పారు. జాలాది గ్రామంలోని జగనన్న కాలనీని శుక్రవారం ఆయన సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీ వై.హనుమారెడ్డి, హౌసింగ్ ఏఈ బాష పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ గాయత్రీ మహాయజ్ఞం

రొంపిచర్ల : స్థానిక రాజుల బజారులోని నిదానం పాటి శ్రీలక్ష్మీ అమ్మవారి పుట్ట వద్ద శుక్రవారం శ్రీలక్ష్మీ గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించారు. వేద పండితులు పేరిశాస్త్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మంత్రాలమ్మ గుడిలో పూజలు



బొల్లాపల్లి : కారంపూడి మండలం మంత్రాలమ్మ దేవస్థానంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొత్త రామిరెడ్డి మొక్కుబడి కార్యక్రమానికి వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు బొల్లా గిరిబాబు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

రొంపిచర్ల: వడ్లమూడివారిపాలెం, గోగులపాడు గ్రామాల్లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను పల్నాడు జిల్లా యాలైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి పరిశీలించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నరసరావుపేట టౌన్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధురాలు ఏరియా వైద్యశాలలో మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. వారం రోజుల క్రితం గుర్తుతెలియని వృద్ధురాలు శాంతయ్య సత్రం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండగా గమనించిన స్థానికులు సమాచారాన్ని 108కు అందజేశారు. సిబ్బంది ఆమెను ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. వడదెబ్బ వల్ల మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

22 గొర్రెలు చోరీ

నాదెండ్ల: మండలంలోని తుబాడు గ్రామంలో షేక్ శ్రీనుబాషకు చెందిన 22 గొర్రెలు గురువారం అర్ధరాత్రి అపహరణకు గురయ్యాయి. మొత్తం 32 గొర్రెలు ఉండాల్సి ఉండగా ఉదయానికి 12 మాత్రమే కనిపించాయి. దీంతో బాష నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీటి విలువ రూ.3లక్షల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సూక్ష్మ పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహం

యడ్లపాడు: ఆహార ఉత్పత్తుల తయారీలో సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం సువర్ణ అవకాశాన్ని కల్పించిందని యడ్లపాడు మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రధానమంత్రి ఫార్మేషన్ మైక్రోఎంటర్‌ప్రెన్యూర్స్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమ నియమ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఉద్యానశాఖ అధికారి కిషోర్ యాదవ్, ఏపీఎం జీవన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కారును ఢీకొన్న మూడు వాహనాలు

నాదెండ్ల : గణపవరం జాతీయ రహదారిపై సినీఫక్కీలో రోడ్డు ప్రమాదం జరిగింది. గుంటూరు వైపు నుంచి చిలకలూరిపేటకు వెళ్తున్న కారు యూటర్న్ వద్ద సడన్ బ్రేక్ వేయడంతో ముందు ఉన్న కారును ఢీకొట్టింది. దీంతో ఆ కారును మరోకారు, వరుసగా మరో రెండు లారీలు ఢీకొన్నాయి. వాహనాలు ధ్వంసమయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం లేదు. సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది.

హామీలన్నీ అమలు సీఎం జగన్ ఘనతే

- అన్నివర్గాలకూ మేలు చేసిన ప్రభుత్వం మనది
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరును వివరించారు. నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధి గురించి వెల్లడించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ జగనన్న ప్రభుత్వం అందజేస్తున్నదని వివరించారు. ఈ ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందని కొనియాడారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉండడం మనందరి అదృష్టమని స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మేలు చేయాలనే లక్ష్యంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వివరించారు. నాడు-నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నట్టు వెల్లడించారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు గడప గడప కార్యక్రమానికి లభిస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు కట్టా వెంకటేశ్వర్లు, నర్రా సత్యనారాయణ, కట్టా శివనాగేశ్వరరావు, గోరంట్ల నరసింహారావు, కమ్మ రాంబాబు, పల్లపాటి ఇస్మాయిల్, జిర్రా సాల్మాన్, కంభంపాటి సరభయ్య, జిర్రా యోహాన్ పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో తాగునీటి పథకానికి శంకుస్థాపన



ప్రజల సమస్యలు తీర్చడం ప్రభుత్వాల కర్తవ్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.60 లక్షలతో మంచినీరు పైపులైన్ల నిర్మాణం, ఇంటింటికీ మంచినీటి కుళాయి పనులకు శుక్రవారం మంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ గ్రామగ్రామాన మంచినీటి సమస్య పరిష్కరించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, గ్రామ సర్పంచ్ ఉసర్తి భూలక్ష్మి, ఉప సర్పంచ్ కొమ్మనబోయిన రామకృష్ణరాజు, వైస్ ఎంపీపీ సూరబోయిన ఆదిలక్ష్మి, మురికిపూడి సొసైటీ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటశివ, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొమ్మనబోయిన హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మోటార్ ట్రైసైకిళ్లు పంపిణీ



చిలకలూరిపేట: దివ్యాంగులకు పూర్తిస్థాయిలో అండగా ఉన్నది జగనన్న ప్రభుత్వమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం రామచంద్రాపురం గ్రామంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పది మందికి శుక్రవారం మోటార్ ట్రై సైకిళ్లను మంత్రి పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని వెల్లడించారు. నియోజకవర్గానికి పది మోటార్ ట్రై సైకిళ్లు మంజూరు కాగా ఒక్కోదానికి ప్రభుత్వం రూ.90,000 వెచ్చించిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి పాల్గొన్నారు.

నర్సుల సేవాభావం అమూల్యం

నరసరావుపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బీవీ రంగారావు సారథ్యంలో నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.జయకరుణ ఆధ్వర్యంలో నర్సులు కొవ్వొత్తులతో నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి నర్సులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ రంగారావు మాట్లాడుతూ వైద్యశాలలో ఆరుగురు హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు 14మంది పని చేస్తున్నారని, మరో 24 మంది ఏఎన్ఎంల నుంచి జీఎన్ఎంలుగా శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. వారి సేవాభావం అమూల్యమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ దయానిధి పాల్గొన్నారు.

వినుకొండలో..

వినుకొండ(నూజెండ్ల) : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం పలువురు నర్సులకు బహుమతులు అందించారు. డాక్టర్ రజాక్, ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన ఆరోగ్య మిత్ర ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి, డాక్టర్ బాలునాయక్, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ వెంకటేష్, హెడ్‌నర్స్ చిరంజీవి పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



వేల్పూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ నాగులపాటి చెన్నయ్య

శావల్యాపురం: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య కోరారు. శుక్రవారం మండలంలోని వేల్పూరు, కారుమంచి సొసైటీ కేంద్రాల్లో మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ చెన్నయ్య మాట్లాడుతూ మొక్కజొన్న పంటను సాగు చేసిన రైతులందరూ రైతుభరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకుంటే మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పారదర్శకంగా క్వింటా రూ.1,962కు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు యం.అనిల్‌కుమార్, తూమాటి కబ్బారావు,ముండ్రు రాఘవరావు, ఏవో రామినేని రామారావు, ఏఈవో పురేటి అశోక, సొసైటీ సీఈఓలు జాలాది నాగ ప్రసాదు, డి.వెంకటనారాయణ, వీఏఏ వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

నాదెండ్ల/యడ్లపాడు: పలుచోట్ల గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. గణపవరం, బుక్కాపురం, రాజుగారిపాలెం, గున్నవారిపాలెం గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. యడ్లపాడు మండలంలోనూ గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. విద్యుత్‌స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ తీగలపై పిడుగుపడి ఇన్సులేటర్లు పేలిపోయాయి. ఫలితంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. లింగారావుపాలెం, సొలస గ్రామాల్లో కల్లాలపై ఉంచిన టార్పాలిన్ పట్టాలతో పాటు మొక్కజొన్న గింజలు ఈదురుగాలులకు కొట్టుకుపోయాయి. సొలస గ్రామంలోని జెడ్పీహైస్కూల్‌లో వెనుక ఉన్న చెట్లు నేలకొరిగాయి. గాలివాన వల్ల విద్యుత్‌శాఖకు రూ.25 వేల నష్టం వాటిల్లిందని ఏఈ సాంబశివరావు తెలిపారు.

15న ఏఎంసీ చైర్మన్ ప్రమాణస్వీకారం

ఈపూరు : ఈపూరు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా చుండూరి వెంకటేశ్వర్లు సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు యార్డు కార్యదర్శి మురళి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం ఈపూరు మార్కెట్ యార్డు కొత్త పాలకవర్గ గౌరవాధ్యక్షునిగా వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, చైర్మన్‌గా చుండూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ బెలూం శ్రీరామ్ రెడ్డిని నియమించింది. మరో 17మందిని కమిటీ మెంబర్లుగా నియమించింది.

అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు భూముల స్వాధీనం



వినుకొండ(నూజెండ్ల) : వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు గుర్తిస్తే స్వాధీనం చేసుకుంటామని వక్ఫ్‌బోర్డు స్టేట్ స్పెషలాఫీసర్ ఎస్‌కే షిరీన్‌బేగం చెప్పారు. వినుకొండలో అన్యాక్రాంతమైన మసీదు మాన్యం భూమిని స్థానిక అధికారులతో కలిసి ఆమె శుక్రవారం పరిశీలించారు. తిమ్మాయపాలెంలో ఆక్రమణకు గురైన ఆరు ఎకరాల భూమిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతమైతే స్వాధీనం చేసుకుంటామన్నారు. వక్ఫ్‌బోర్డు భూముల్లో నివాసం ఉంటున్న వారికి జగనన్న కాలనీల్లో గృహాల మంజూరుకు సిఫార్సు చేస్తామని చెప్పారు. జామియా మసీదు, స్థానిక ముస్లిం పెద్దలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో షకీలా దస్తగిరి, ముస్లిం మైనార్టీ నాయకులు పీఎస్ ఖాన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన ఘటన శుక్రవారం జరిగింది. 108 సిబ్బంది కథనం ప్రకారం నరసరావుపేటకు చెందిన షేక్ కరిముల్లా బస్సులకు సీట్లు కుడుతుంటాడు. తన ద్విచక్రవాహనంపై సీట్ల మెటీరియల్ కోసం చిలకలూరిపేటకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని లింగంగుంట్ల సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కరిముల్లాకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితుడిని నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో శుక్రవారం పేద విద్యార్థిని పేలూరి దీప్తి చదువు నిమిత్తం రూ.2వేలు ఆర్థిక సహాయాన్ని ఆమె తల్లి దీపకు అందజేశారు. దాత పబ్బిశెట్టి బద్రీనాథ్ ఆర్థిక సహకారంతో నగదు అందచేశారు. మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.2లక్షల ఉపకార వేతనాలు అందజేయనున్నట్టు తెలిపారు. అర్హులైన పేద విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు కొత్త హనుమంతరావు, కె.ఎం.ఎల్.ప్రసాద్ పాల్గొన్నారు.

తేమ శాతం 14 మాత్రమే ఉండాలి

యడ్లపాడు: మొక్కజొన్న రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తమ ఉత్పత్తుల్ని విక్రయించుకోవాలని, తేమశాతం 14 మాత్రమే ఉండేలా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత రైతులకు సూచించారు. మండలంలోని లింగారావుపాలెం గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో సాగుకు సమాయత్తం కార్యక్రమం శుక్రవారం జరిగింది.

వాణిజ్య పంటలతో అధిక దిగుబడులు

ఈపూరు : ఆహార పంటలతోపాటు వాణిజ్య పంటలనూ సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంపీడీఓ ఉషాకిరణ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో వాణిజ్య పంటల సాగు - రైతు జీవితం బాగు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు మండల ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ మాట్లాడుతూ పలు పంటల సేద్యం, రాయితీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మణరావు, టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతరావు పాల్గొన్నారు.

• 'చల్ల'ని మనసులు



వేసవిలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. శివునిబొమ్మ సమీపంలో బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రారంభించారు. పరోపకారానికి చల్లని మనసు ఉండాలని చెప్పారు.
– నరసరావుపేట ఈస్ట్

ప్రభుత్వ రాయితీలను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల) : మత్స్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందజేస్తున్న రాయితీని మత్స్య కారులు వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చెప్పారు. స్థానిక మత్స్య శాఖ అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీతో మంజూరైన మినీ లారీని లబ్ధిదారుడు బోనగిరి నాగరాజు (బొగ్గరం, ఈపూరు మండలం)కు ఎమ్మెల్యే చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపల రవాణాకు వాహనాలను 60 శాతం రాయితీతో అందిస్తుందని వివరించారు. లబ్ధిదారుని వాటా 40 శాతం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో వినుకొండ మత్స్య శాఖ అభివృద్ధి అధికారి పి.ఎస్.కిరణ్‌కుమార్, చిన్నతరహా పరిశ్రమల స్టేట్ డైరెక్టర్ తలారి ఆంజనేయులు, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు, మందపాటి రామారావు, కృష్ణానాయక్, బొల్లాపల్లి మండల కన్వీనర్ మట్టి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ



నరసరావుపేట రూరల్: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. పెట్లూరివారిపాలెంలో శుక్రవారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ భూ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ శేషిరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ మేకల మురళి పాల్గొన్నారు.